
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 6 మార్చి 2025





అనుభవంలో ఉన్న ఇళ్ల క్రయ విక్రయాలకు అనుమతులివ్వండి

తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం, అవిలాల, సాయినగర్, లింగేశ్వరనగర్‌లో సర్వే నెంబర్ 240, 241, 242, 239-1, 147, 321, 322, 323 నెంబర్ల లోని స్థలాల్లో 1975లో రైతుల దగ్గర భూములు తీసుకుని, లేఅవుట్‌లు వేశారు. వీటిలో రెండు వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీరికి ప్రభుత్వం కూడా మౌలిక వసతులు కల్పించింది. కానీ 2001లో హథీరాంజీ మఠం వాళ్ళు లేఅవుట్‌లు వేసిన స్థలాలు తమవని, క్రయ విక్రయాలు జరపరాదని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణానికి తుడా అప్రూవల్, బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదు. ఈ సమస్యను 2001, 2002లో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు దృష్టికి బాధితులు తీసుకెళ్లగా ఆయన సీసీఎల్‌కు సిఫార్సు చేశారు. అక్కడ్నుంచి తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి విచారణ నిమిత్తం ఉత్తర్వులు పంపారు. గత పాలకులు ఆ విచారణ పూర్తి చేయలేదు. దీనివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను సత్వరం పరిష్కరించండి.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే



గురుకులంలో మెరుగైన వసతులు కల్పించండి

పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురంలో 23 ఏళ్ల కిందట ప్రారంభమైన అంబేడ్కర్ గురుకుల పాఠశాల.. గడిచిన ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైంది. భద్రత, అవసరాల విషయంలో 540 మంది విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాల, హాస్టల్ సదుపాయం ఉంది. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లను అందుబాటులోకి తీసుకురావాలి. ఇటీవల వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. బాలికల భద్రత దృష్ట్యా ప్రహరీని వెంటనే నిర్మించాలి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. అదనంగా నాలుగు తరగతి గదులను నిర్మించాలి. ఇంటర్నెట్‌ను ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలి. బోధన సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే



సత్యవేడు సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రి స్థాయికి పెంచాలి

మా నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రివేళ డాక్టర్లు అందుబాటులో ఉండరు. సీహెచ్‌సీలో కాన్పులు చేసేందుకు గైనకాలజిస్ట్ లేరు. దీంతో పేదవాళ్ళు సిజేరియన్ కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి.. రూ.లక్ష ఫీజు కట్టలేక అప్పులపాలవుతున్నారు. అన్ని వసతులున్న సత్యవేడు సీహెచ్‌సీకి మహిళా డాక్టర్‌ను నియమించాలని గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా అడిగి అడిగి విసిగిపోయా. 183 పంచాయతీలు, 680 గ్రామాలు, 280 పరిశ్రమలు కలిగిన శ్రీసిటీ సెజ్ ఉన్న మా నియోజకవర్గంలో రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో లేక ఏదైనా ప్రమాదాలు జరిగినా, అత్యవసర పరిస్థితులు వచ్చినా ప్రథమ చికిత్స కూడా అందుబాటులో లేని దుస్థితి. ఎమర్జెన్సీ అయితే చెన్నైకు 60 కిలోమీటర్లు, తిరుపతికి 100 కిలోమీటర్లు వెళ్లాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని పీహెచ్‌సీలలో రాత్రివేళ డాక్టర్లను అందుబాటులో ఉంచాలి. సత్యవేడు సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రి స్థాయికి పెంచి, గైనకాలజిస్టను నియమించాలి.

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే



మెడికల్ మాఫియా చేతిలో ప్రభుత్వ వైద్యం

గత వైసీపీ పాలకులు స్వలాభం కోసం కొన్ని మందుల కంపెనీలతో కుమ్మక్కై, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలలను మెడికల్ మాఫియా చేతుల్లోకి నెట్టేశారు. దీంతో బయట ఎక్కడా అమ్ముడుపోని మందులను వైద్య కేంద్రాలకు తరలిస్తున్నారు. అవి ప్రజలకు ఉపయోగం లేకపోవడంతో ఎక్స్‌పైరీ అయిపోతున్నాయి. వాటిని నిరుపయోగంగా మార్చి వదలించుకుంటున్నారు. దీంతో పేదలకు అవసరమైన కనీస మందులు లభించని దుర్భర పరిస్థితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. ఇక, ప్రభుత్వ వైద్యులకు కనీస వసతులు లేవు. జ్వరం పరీక్షించే థర్మామీటర్, బీపీ పరికరాలు వంటివి కూడా కొన్ని చోట్ల లేవు. మెడికల్ మాఫియా చేతి నుంచి ప్రభుత్వ వైద్యశాలలను రక్షించుకుని ప్రజలకు మంచి వైద్యం అందించాలన్న తపనతో సమస్యను మీముందు ఉంచుతున్నా.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే



ఓటేరు చెరువు చదరం

తిరుపతికి కూత వేటులో ఉండే ఓటేరు చెరువు ఆక్రమణల పర్వం మళ్లీ మొదలైంది. రాత్రికి రాత్రి యంత్రాలను పెట్టి చదును చేస్తున్నారు. పెద్ద ఎత్తున మట్టితోలుతున్నారు. పగలు మాత్రం ఏ అలికిడీ ఉండడంలేదు. ఎవరు చేస్తున్నారనే విషయం కూడా వెల్లడి కాకుండా జాగ్రత్త పడుతున్నారు. దాదాపు వంద కోట్లకుపైగా విలువైన స్థలం ఆక్రమణకు నిశ్శబ్దంగా ప్రయత్నం జరుగుతోందని తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మట్టి పోసి చెరువును పూడ్చేశారిలా..



కబ్జాకు గురైన ఓటేరు చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

- రూ.వంద కోట్ల భూమిలో పాగా
- గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో పనులు
- అడ్డుకున్న గ్రామస్తులు
- ఆందోళనకు దిగిన సీపీఐ నాయకులు
- కోర్టులో వివాదం నడుస్తుండడంతో పనులను ఆపిన రెవెన్యూ సిబ్బంది

రాష్ట్రంలో అధికారం మారినప్పుడల్లా ఓటేరు చెరువు ఆక్రమణల అంశం వివాదాస్పదం అవుతూనే ఉంది. పదేళ్ల క్రితం ఓటేరు చెరువులో కొనసాగిన ఆక్రమణల పర్వం అప్పట్లో సంచలనం రేపింది. దీనివెనుక ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రమేయం ఉన్నట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల క్రితం రాజకీయ నాయకులకు దగ్గరగా ఉండే ఓ వ్యక్తి దాన సెటిల్‌మెంట్ పేరుతో 80 సెంట్ల భూమిని నెల్లూరు జిల్లా వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడంపై మరోసారి ఈ అంశం భగ్గుమంది. దీంతో పనులు నిలిపివేశారు. ఈ వ్యవహారంలో భాగస్వామ్యమైన రిజిస్ట్రేషన్ అధికారులు విచారణ ఎదుర్కొన్నారు. తాజాగా నాలుగు రోజులుగా కొందరు ఓటేరు చెరువును రాత్రికి రాత్రే చదును చేయడం మొదలుపెట్టారు. ఇది తెలుసుకున్న ఓటేరు గ్రామస్తులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల మధ్య న్యాయస్థానంలో కేసు నడుస్తున్నందున తీర్పు వచ్చేవరకు వివాదంగా ఉన్న చెరువు స్థలంలోకి ఎవరూ ప్రవేశించకూడదని రెవెన్యూ సిబ్బంది చెప్పి పనులు నిలుపుదల చేశారు.

ఓటేరు వివాదమిదీ

తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ సమీపంలో 1934లో ఓటేరు చెరువు ఏర్పాటైంది. ఆ తర్వాత మెమోలు ద్వారా సర్వే నెం:377లో 17.18 ఎకరాలు ఉన్న చెరువును సబ్ డివిజన్ చేశారు. 377/1లో 7.53 ఎకరాలు, 377/2లో 3.95 ఎకరాలు, 377/3లో 5.70 ఎకరాలుగా విభజించారు. 377/2లోని 3.95 సెంట్లును ప్రజావసరాల కోసం జాతీయ రహదారికోసం వాడుకున్నారు. తక్కిన 377/1, 377/3 సర్వే నెంబర్లు వివాదంలో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై జలపరిరక్షణ సమితి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఓటేరు చెరువుగల 36.34 ఎకరాల భూమి ఓటేరు చెరువుదేనని 2006లో ప్రభుత్వం నిర్ధారించింది. 13-10-2013న ఏపీ హైకోర్టు సదరు భూమిని ప్రభుత్వ చెరువు భూమిగా ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓటేరు చెరువు భూమిగానే నిర్ధారించింది. అయినా ఆక్రమణల ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పరిరక్షణకై పోరాటం: సీపీఐ

ఓటేరు చెరువును మట్టితో పూడ్చిన భూకబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఓటేరు చెరువును పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి హైవే ఆనుకుని ఉండే ఓటేరు చెరువును అర్ధరాత్రిలో భూకబ్జాదారులు టిప్పర్లతో మట్టితోలి పూడ్చివేస్తున్నారన్నారు. పూడ్చిన వారిపై ఇంతవరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువ కలిగిన చెరువు భూమిని కాపాడాలని రెండు నెలల క్రితం కలెక్టర్‌ను కలిశామన్నారు. తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ శివ, శ్రీరాములు, విజయ, అలివేలమ్మ, అల్లాభక్షు, రవి, కిషోర్, శ్రీనివాసులు, కార్తీక్ పాల్గొన్నారు.

రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌కు డిగ్రీ విద్యార్థి బలి

- గాయపడ్డ మృతుడి తమ్ముడు అపస్మారక స్థితిలోకి



మృతి చెందిన రవిశేఖర్, అపస్మారక స్థితిలో మునికుమార్

పుత్తూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ద్విచక్రవాహనాన్ని రాంగ్‌సైడ్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా అతడి సోదరుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు.సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు..పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ కుమారులు మునికుమార్, రవిశేఖర్(18) పుత్తూరులోని వేదవ్యాస కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు.బుధవారం కళాశాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.10 నిమిషాల్లో కళాశాలకు చేరుకోవాల్సిన అన్నదమ్ములను పిల్లారిపట్టు సమీపంలోని వందన వైన్స్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవిశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా,మునికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.రవిశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మునికుమార్‌ను మెరుగైన వైద్యం కోసం రేణిగుంట సమీపంలోని అమర ఆస్పత్రికి తరలించారు.ప్రమాద సమాచారం తెలుసుకుని వచ్చిన మంజునాథ్ దంపతులు చిన్న కొడుకు రవిశేఖర్ మృతదేహం వద్ద బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.పెద్ద కొడుకు మునికుమార్ పరిస్థితి కూడా విషమంగా మారడంతో వారు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

వ్యతిరేక దిశగా వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్

పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో వస్తూ విద్యార్థులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాద ప్రాంతానికి సమీపంలో ఉన్న క్వారీ నుంచి ముగ్గురాయి తీసుకుని వడమాలపేట వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిపై వ్యతిరేక దిశగా డ్రైవర్ గోపి ట్రాక్టర్‌ను నడిపాడు.అతడి వయస్సు 18 సంవత్సరాలు, లైసెన్సు కూడా లేదని సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి పరారవడంతో పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.మరోవైపు కళాశాలకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడేవారని చూసినవారు చెబుతున్నారు.

సీఐఐ తిరుపతి చైర్మన్‌గా జగన్నాథ్



జగన్నాథ్ అనిరుధ్



రాజేంద్రన్

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తిరుపతి జోన్ చైర్మన్‌గా గంగవరం మండలం గండ్రాజుపల్లెలో వున్న స్విచ్ గేర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథ్ అనిరుధ్ నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా కజారియా సిరామిక్స్ శ్రీకాళహస్తి ప్లాంట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్వీ రాజేంద్రన్ నియమితులయ్యారు. తిరుపతిలో బుధవారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ ప్రకటించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.24

సహరి (శుక్రవారం) : 5.07



వెటర్నరీ వర్సిటీ గేట్లకు తాళం

- రోజంతా వీసీ, అధికారులు, ఉద్యోగులు రోడ్డుపైనే పడిగాపులు
- మెస్‌లు, హాస్టళ్ల మూసివేత నిర్ణయంతో విద్యార్థుల సమ్మె ఉధృతం



గోడదూకి లోపలకు వెళ్లేందుకు పోలీసు బలగాల యత్నం



గేట్లకు తాళాలు వేసి, లోపల నిరసన కొనసాగిస్తున్న విద్యార్థులు



ప్రధాన గేటు వద్ద వర్సిటీ వీసీ జేవీ రమణ, ఏఎస్పీ రవిమనోహరాచారి చర్చలు



రోడ్డుపైనే ఉద్యోగుల పడిగాపులు

తిరుపతి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. వర్సిటీ ప్రధాన గేట్లకు తాళాలేయడంతో వీసీ సహా అధికారులు, ఉద్యోగులంతా రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది. 31రోజులుగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వర్సిటీకి అనుబంధంగా నడిచే మెస్‌లు, హాస్టళ్లను మూసివేస్తూ అధికారులు నోటీసు జారీచేశారు. బుధవారం ఉదయం మెస్‌లను మూసేసినట్లు చెప్పగానే.. వర్సిటీలోకి ప్రవేశించే రెండు ప్రధాన మార్గాలలోని గేట్లకు విద్యార్థులు తాళాలేశారు. తమ లగేజీబ్యాగులు, ప్లేట్లని ముందు పెట్టుకుని లోపల వైపు నిరసన కొనసాగించారు. దీంతో ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బంది బయట రోడ్డుపైనే నిలబడ్డారు. గేట్లు మూసే అధికారం ఎవరికీలేదని, ఉద్యోగులను లోపలకు అనుమతించాలని ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ సీఐ రామయ్య, సిబ్బంది కోరారు. మెస్‌లను మూసేసి తమను అన్యాయంగా రోడ్డుపైకి చేర్చారని, న్యాయం జరిగేవరకు గేట్లు తెరిచేది లేదని విద్యార్థులు భీష్మించారు. అధికారులు, ప్రొఫెసర్లతో కలసి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ విద్యార్థులతో మాట్లాడారు. స్టైఫండ్ పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికెళ్లగా సానుకూలంగా ఉందని వివరించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే మెస్, హాస్టళ్లను ఎందుకు మూసేశారని విద్యార్థులు ప్రశ్నించారు. ఎంతకూ విద్యార్థులు గేట్లు తెరవకపోవడంతో ప్రత్యేక బలగాలతో కలిసి పోలీసులు వర్సిటీ గోడపై నుంచి లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. విద్యార్థులు అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం వరకూ రోడ్డుపై, ఫైఓవర్‌కింద వేచి చూసిన ఉద్యోగులు ఆపై వెనుదిరిగారు. కొందరు ఉద్యోగులు వ్యవసాయ కళాశాల మీదుగా వర్సిటీలోకి ప్రవేశించే మార్గానికి చేరుకోగా అక్కడా గేట్లకు తాళం వేసి ఉండటంతో వెళ్లలేకపోయారు.

ఏఎస్పీ సమక్షంలో చర్చలు

వెటర్నరీ వర్సిటీ గేటు వద్దకు ఏఎస్పీ రవిమనోహరాచారి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. చివరకు విద్యార్థులు మూడు ప్రధాన డిమాండ్లను పోలీసుల దృష్టికి తెచ్చారు. ఆయన వీసీని ప్రధానగేటు వద్దకు పిలిపించి విద్యార్థులతో మాట్లాడించారు. హాస్టళ్ల, మెస్‌ల మూసివేత నిర్ణయం వెనక్కితీసుకోవాలని, తమను ప్రభుత్వ పెద్దల వద్దకు చర్చకు తీసుకువెళ్లాలని, సమస్య పరిష్కారమయ్యేవరకు శాంతియుతంగా సమ్మె కొనసాగించనివ్వాలని కోరారు. వీసీ సానుకూలంగా స్పందించడంతో గేట్లు తెరిచారు. కాగా, వీసీ మీడియాతో మాట్లాడుతూ.. అకడమిక్ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇది చాలా విలువైన సమయమన్నారు. సమ్మె విరమించి తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు. స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఉత్సవర్ల ఊరేగింపు

వైభవంగా ఏకాంత సేవ

- ముగిసిన ముక్కంటి వార్షికోత్సవాలు



శయన మందిరంలో ఉత్సవర్లు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజైన బుధవారం రాత్రి జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి ఏకాంతసేవ నిర్వహించారు. ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవర్లను మోసుకొచ్చిన చిన్నపల్లకీ స్వామివారి ఆవరణ నుంచి అమ్మవారి శయన మందిరం చేరింది. ఆలయం మూసివేత సమయంలో అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో కూర్చోబెట్టి హారతిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సమూర్తిని అదే పల్లకీలో ఉంచి అమ్మవారి శయన మందిరం వద్దకు తీసుకొచ్చారు. అక్కడి పడక ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి ఊయల ఊపుతూ ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామి అమ్మవార్లను ఏకాంతంగా వదిలి అర్చకులు, భక్తులు వెలుపలకు వచ్చి తలుపులు మూయడంతో ఏకాంతసేవ ముగిసింది. ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పరిశీలన


ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహన్

పాకాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెవడ్డేపల్లె రెవెన్యూ పరిధిలో బుధవారం తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ పంటపొలాలను సందర్శించారు. ఈ-పంటకు సంబంధించి సాగు విస్తీర్ణం, పంట వివరాల నమోదును పరిశీలించారు. ఈ పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు కె.కృష్ణపిళ్లై, లక్ష్మీ, విఆర్‌ఏలు మహదేవ్, వానాద్రి, విఏఏ కౌశిక్ రైతులు,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

చంద్రగిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దోర్నకంబాలలో బుధవారం నడివీధి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి దోసుళ్ళ వంకలో బంకమట్టితో నడివీధి గంగమ్మ ప్రతిమను తయారు చేసి, విశేషంగా అలంకరించి, అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ, కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు సారె సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



చంద్రగిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవరమనోహర్ కోరారు. బుధవారం చంద్రగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2025 వరకు ప్రజా సమస్యలపై చేసిన పోరాటాల ఫలితంగానే ఎన్డీయే కూటమి అధికారాన్ని చేపట్టిందన్నారు. ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయడానికి జనసైనికులు, పవన్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, మండల అధ్యక్షుడు బొమ్మల కిషోర్, రాయల్ వెంకట్, వగడాల యువరాజ్, నాని, యువకిశోర్, రూపేష్, కిరణ్, రాకేష్, వీర మహిళలు విజయనిర్మల, మంజులవాణి తదితరులు పాల్గొన్నారు,

ఆర్థికాభ్యున్నతికి సంక్షేమ పథకాల ఆసరా


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధారెడ్డి

పాకాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి ఆసరాగా నిలవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి కోరారు. వల్లివేడు, ఈపాలగుట్టపల్లె, పేరసానిపల్లె పంచాయతీల్లో బుధవారం ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా పథకాలు అర్హులందరికీ అందేలా కృషిచేస్తామన్నారు. మహిళలు పొదుపు సంఘాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి, చాముండేశ్వరి పాల్గొన్నారు.

మాజీ చీఫ్ జస్టిస్ నుంచి పట్టా అందుకున్న వైద్య విద్యార్థిని



జస్టిస్ చంద్రచూడ్ చేతుల మీదుగా పట్టాను అందుకుంటున్న శర్మిష్ఠారాయ్


చంద్రగిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెలుగు ప్రాజెక్టు ఏపీఎం చినగంగయ్య కుమార్తె డాక్టర్ శర్మిష్ఠారాయ్ జనరల్ సర్జరీ మాస్టర్ పట్టాను అందుకున్నారు. ఈమె 2020లో నీట్‌లో 108వ ర్యాంక్ సాధించారు. ఢిల్లీలో మౌలానా ఆజాద్ మెడికల్ కళాశాలలో ఎంఎస్(జనరల్ సర్జరీ) చదివారు. మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బుధవారం ఢిల్లీలోని జరిగిన స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు.

మద్యం షాప్ వద్దంటూ ఆందోళన


బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

తిరుపతి రూరల్, మార్చి5(ఆంధ్రజ్యోతి): సాయినగర్ పంచాయతీలో మద్యం షాపు వద్దంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. విద్యార్థులు,మహిళలు, ఏఐఎస్ఎఫ్ నేతలు షాపు ఎదురుగా బైఠాయించారు. పాఠశాలలు, మేనేజ్‌మెంట్ హాస్టళ్లు, జనావాసాలసమీపంలో మద్యం షాపు ఎలా అనుమతిస్తారంటూ ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. సీఐ చిన్నగోవిందు, పోలీసులు చేరుకుని నిరసన విరమించాలని కోరినా ఆందోళనకారులు ససేమిరా అన్నారు. నిర్వాహకులను షాపు మూసివేయించడంతో వారు వెనుతిరిగారు. పాఠశాల విద్యార్థులను ధర్నాలో భాగస్వామ్యం చేయడాన్ని పలువురు తప్పుబట్టారు.

శ్రీవారి సేవలో నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సభ్యులు


ఆహ్వాన పత్రికలతో నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సభ్యులు

తిరుమల, మార్చి5 (ఆంధ్రజ్యోతి): నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సభ్యులు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సొసైటీ సభ్యులు శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. జూలై 4 నుంచి 6వ తేదీ వరకు అమెరికాలోని ఫ్లోరిడాలో తెలుగు సంబరాలు జరుగనున్నాయన్నారు. ఈక్రమంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు. ఆహ్వానపత్రికను సమర్పించి, కార్యక్రమం విజయవంతం కావాలని ప్రార్థించామన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


అక్కుర్తి వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొనడంతో కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి పట్టణం పానగల్‌కి చెందిన శేఖర్(30) ధాన్యం కాటా వేసే కూలీ. మంగళవారం రాత్రి పనులు ముగించుకుని జాతీయ రహదారిపై నడిచి ఇంటికి బయలుదేరాడు. మంగళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి అమరావతికి ప్రయాణికులతో వెళ్తుండగా ఊరందూరు వద్ద ఢీకొంది. ఈ ఘటనలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి తరలించారు. బుధవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్కుర్తి వద్ద ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం ఉప్పరపల్లికి చెందిన వంశీ ఏర్పేడు మండలంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తుంటాడు. బుధవారం సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అక్కుర్తి వద్ద మలుపులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ రవినాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

చంద్రగిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మిన్, క్షత్రియ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపీడీవో శేఖర్ ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. కులం, ఆదాయం, విద్యార్హతలకు సంబంధించి సర్టిఫికేట్లను తీసుకుని ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

సర్పంచ్ సుభాషిణికి అభినందన



తిరుపతి రూరల్, మార్చి5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఉత్తమ పురస్కారం అందుకున్న చెర్లోపల్లె గ్రామ సర్పంచ్ బి.సుభాషిణిని బుధవారం రూరల్ మండల డీలర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు గుత్తా కోటేశ్వరనాయుడు అభినందించారు. దుశాలువాతో సత్కరించారు. పంచాయతీని మరింతగా అభివృద్ధి దిశగా నడిపించాలని కోరారు. శుభగిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ సీఈగా వరప్రసాద్

ఎస్ఈ మల్లికార్జునరెడ్డి పదోన్నతిపై బదిలీ

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీరుగా ఎంఎల్ఎన్ వరప్రసాద్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ అనంతపురం హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎస్ఈగా పనిచేస్తున్న ఆయనకు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తిరుపతికి బదిలీ చేసింది. అలాగే తిరుపతిలో తెలుగు గంగ, గాలేరు-నగరి ప్రాజెక్టుల ఎస్ఈగా పనిచేస్తున్న ఎం.మల్లికార్జునరెడ్డి పదోన్నతిపై విజయవాడలోని హెచ్ఆర్‌డీ విభాగానికి చీఫ్ ఇంజినీర్‌గా నియమించింది. బుధవారం ఈ మేరకు సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.కోటి విరాళంగా అందింది. హరియాణాకు చెందిన వినీత్ ఆరోరా, దివ్యా ఆరోరా ఈ విరాళాన్ని ఇచ్చారు. రూ.1.01 కోటి విరాళం డీడీని తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి బుధవారం రాత్రి అందజేసి అన్నప్రసాదం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

24న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

● వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న బోర్డు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం ఈనెల 24వ తేదీన జరగనుంది. తొలుత ఈనెల 8వ తేదీన సమావేశాన్ని నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ పరిపాలన కారణాలతో 24వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజున ప్రధానంగా 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో పాటు పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు.

అశ్వవాహనంపై వేంకటేశ్వరుడి వైభవం



శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలం తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామిఅమ్మవార్లు అశ్వవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. ముందుగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది. అనంతరం గ్రామ వీధుల్లో తిరుచ్చిపై ఊరేగారు. సాయంత్రం ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై ఆశీనులై భక్తులకు అభయమిచ్చారు.

వేలంతో రూ.9.21 లక్షల ఆదాయం

నారాయణవనం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ నారాయణవనంలో ఆదాయ వనరులను 2025-26 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ వేలం బుధవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో శ్రీకాళహస్తి డివిజనల్ పంచాయతీ అధికారి బి.ప్రభురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టూ రిస్ట్ బస్టాండు, వారపుసంత, దినసరి మార్కెట్ ద్వారా రూ.60,800, టూరిస్ట్ బస్టాండ్ ద్వారా రూ.7.25 లక్షలు, ఆటో స్టాండ్ ద్వారా రూ1.13 లక్షలు, జంతు వధశాల ద్వారా రూ.23 వేలు ఆదాయం వచ్చిందని ఈవో షణ్ముగం చెప్పారు.

'స్వర్ణ పంచాయత్' దిశగా అడుగులు

● గ్రామాల్లో సేవలన్నీ ఆన్‌లైన్‌లో.. ● పారదర్శకతకు పెద్దపీట


వేదాంతపురం పంచాయతీ కార్యాలయం

తిరుపతి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన గ్రామ పంచాయతీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. నిధులను విడుదల చేస్తూ జవసత్వాలను కల్పిస్తోంది. సర్పంచుల ఉత్సవ విగ్రహాలు కాదని, గ్రామపాలకులని చాటుతోంది. పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు కూడా ప్రారంభమవుతున్నాయి. స్వర్ణ పంచాయత్ పేరిట పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఓ వెబ్‌సైట్‌నూ రూపొందించింది. తిరుపతి రూరల్ మండలంలో స్వర్ణ పంచాయత్ దిశగా అడుగులు పడుతున్నాయి. పంచాయతీల్లో లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిపైసాకు జవాబుదారీతనం ఉండేలా జాగ్రత్త వహిస్తున్నారు. ఇంటి పన్నుల సమాచారాన్ని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అసెస్‌మెంట్ల వారీగా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. పన్నులను డిజిటల్ విధానంలో చెల్లించే అవకాశం కల్పించారు. దీని కోసం ఓ యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నారు..దీనివల్ల నిధులు నేరుగా పంచాయతీకి జమవుతాయి. జియో మ్యాపింగ్ వల్ల మార్కెట్‌ను బట్టి పన్ను డిమాండ్‌ను నిర్ణయించనున్నారు స్వర్ణపంచాయత్ వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తే అక్రమాలకు చెక్ పడనుంది. వెబ్‌సైట్‌లో పంచాయతీ ముఖచిత్రం ఉంటుంది. పంచాయతీకి సంబంధించిన సమగ్ర వివరాలన్నీ అందులో ఉంటాయి.

ఆన్‌లైన్‌లో నమోదు



మండలంలోని పంచాయతీల అసెస్‌మెంట్లన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి. కొన్నింటికి దిద్దుబాటు ప్రక్రియ చేపట్టాం. పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలన్నీ ఆన్‌లైన్లో పొందవచ్చు. గతంలో నిర్వహించిన అసెస్‌మెంట్ రిజిస్టర్ అవసరం ఇక ఉండదు.

-మాధురి, రూరల్ మండల ఈవోపీఆర్డీ

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న టీటీడీ ఉద్యోగులు


క్యారమ్స్ ఆడుతున్న ఉద్యోగులు

తిరుపతి(క్రీడలు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన బాల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో మనోహరంపై వెంకటేశ్వర్లు గెలుపొందారు. టెన్నిస్ డబుల్స్‌లో వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరమణలపై కుమార్, దినకర్‌లు, సింగిల్స్‌లో సంకలిపై దినకరన్ విజయం సాధించారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో మణిచంద్రపై రెడ్డెప్ప, అరుణకుమారిపై విజయలక్ష్మి గెలుపొందారు. డబుల్స్‌లో మునికిరణ్‌కుమార్, సంతానంపై రమణ, మణిచంద్ర, తులసమ్మ, సునీతలపై గంగోజమ్మ, మాధవి గెలుపొందారు. క్యారమ్స్‌లో సింగిల్స్‌లో జయచంద్రపై అశోక్‌కుమార్, డబుల్స్‌లో అశోక్ కుమార్, శ్రీనివాసులపై పాండురంగారెడ్డి, చంద్ర విజయం సాధించారు.

సీఎంను కలిసిన ఆపస్ నాయకులు


ముఖ్యమంత్రికి బుక్‌లెట్ అందజేస్తున్న బాలాజి

తిరుపతి(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ సీఎం చంద్రబాబును తాడేపల్లిలోని సీఎం అతిథిగృహంలో బుధవారం కలిశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులునాయుడితో కలిసి సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం వర్తింపు, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుచేసి అన్ని కేడర్లకు పదోన్నతులు, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సుదూరంలో ఉన్న పాఠశాలల నుంచి 3 నుంచి 5 తరగతులను విలీనం చేయడం వంటి సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు.

ఎస్వీయూలో పీజీ సెట్ ఆఫీసు ప్రారంభం


రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఏపీ పీజీసెట్ ఆఫీసును ఓఆర్ఐ భవనంలో ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు తదితరులు ప్రారంభించారు. పీజీసెట్ నిర్వహణ బాధ్యతను ఎస్వీయూ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు పీజీలో చేరేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీజీసెట్ కన్వీనర్ వీసీ వేంకటేశ్వర్లు, కో-కన్వీనర్ కె.సురేంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

గృహ విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణలో 50 శాతం రాయితీ

పుత్తూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించేందుకు చెల్లించాల్సిన ఛార్జీలలో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందని పుత్తూరు విద్యుత్ డీఈ దేవ ఆశీర్వాదం తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు కిలోవాట్లు, నగరాలలో మూడు కిలోవాట్లు లోడ్‌తో కనెక్షన్లు తీసుకోవాలన్నారు. ఈ మేరకు కిలోవాట్‌కు రూ.2వేలు డెవలప్‌మెంట్ ఛార్జీతో పాటు రెండు వందలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు.. అయితే ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఉంటుందన్నారు. అన్నారు. విద్యుత్ సి బ్బంది ద్వారా కానీ ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు.

తిరుచానూరు పంచాయతీలో వసూల్ రాజా!

● కాంట్రాక్టు ఉద్యోగి చేతివాటంపై తీవ్ర విమర్శలు

తిరుచానూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత రాబడి ఉన్న తిరుచానూరు పంచాయతీలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి వసూల్ రాజా అవతారం ఎత్తాడు. ప్రతి పనికీ వసూలు చేస్తున్నాడన్న విమర్శలున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శులతో పంచాయతీ పాలన గాడి తప్పింది. కూటమి అధికారంలోకి వచ్చాక పంచాయతీ కార్యదర్శిని నియమించలేదు. రెండు నెలలకు ఒకరు చొప్పున ఇన్‌ఛార్జులు కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఓ అధికారి పేరు చెప్పి రెగ్యులర్ ఉద్యోగులపైనా కాంట్రాక్టు ఉద్యోగి ఒకరు హవా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. పంచాయతీలో ఎవరైనా కొత్తగా ఇల్లుకట్టినా, ఇంటి పన్నువేయించాలంటే ఇతడి చెయ్యి తడపాల్సిందే. అతడి ధాటికి రెగ్యులర్ ఉద్యోగులే భయపడే పరిస్థితి. కాగా, ఓ డీకేటీ ఇంటికి పన్ను వేయడానికి.. ఓ లేఅవుట్‌లో నిర్మించిన అపార్టుమెంటులో ఫ్లాట్లకు ఇంటి పన్ను వేయడానికి భారీగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

నేటి నుంచి మసాలా వడ వడ్డింపు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో గురువారం నుంచి అన్నప్రసాదాల మెనూలో మసాలా వడను వడ్డించనున్నారు. అన్నప్రసాదాల మెనూలో మరో నూతన ఆహారపదార్థాన్ని వడ్డించాలని ఇటీవల జరిగిన బోర్డులో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఇటీవల ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. గురువారం నుంచి నిరంతరాయంగా మసాలా వడను వడ్డించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం ఛైర్మన్ బీఆర్ నాయుడు ఈకార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ఎస్వీయూ దూరవిద్యా విభాగానికి పూర్వ వైభవం తెస్తాం

● నూతన డైరెక్టర్ రమేష్ బాబు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా విభాగ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కొన్ని రోజుల క్రితం దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించిన విషయం విదితమే. బుధవారం బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబు మాట్లాడుతూ.. విభాగానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. సకాలంలో నోటిఫికేషన్ విడుదల, ప్రవేశాలు, పరీక్షలు, ఫలితాలు చేపట్టేలా చూస్తామన్నారు. పెండింగ్ పరీక్షలన్నింటినీ వెంటనే పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా దూరవిద్యలో మార్పులు తీసుకొస్తామన్నారు. యూనివర్సిటీ అధికారులు, దూరవిద్యా సిబ్బంది దయాసాగర్ తదితరులు అభినందించారు.

అభివృద్ధికి ఆమడదూరంలో ఆరె జలపాతాలు


ఆరే జలపాతానికి వెళ్లే మార్గం - వాహన పార్కింగ్ - ప్రధాన జలపాతం

కేవీబీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె గ్రామం సమీపంలో ఉన్న ఆరె జలపాతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. సెలవు దినాల్లో ఎంతో మంది పర్యాటకులు ఇక్కడకి వస్తున్నారు. అయితే కనీస వసతులు ఇక్కడ కానరావు. ఆరె గ్రామం నుంచి జలపాతాలకు చేరుకోవాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు వెళ్లాలి. అక్కడ వాహనాలను పార్కు చేసుకుని అక్కడ నుంచి కొండల మధ్య పచ్చని చందనం చెట్ల కింద కాలిబాటన సుమారు రెండు కిలోమీటర్లు వెళితే మొదటి జలపాతం, కాస్త ముందుకు వెళితే కొండలనుంచి ప్రవహిస్తున్న రెండో జలపాతం అలాగే మూడు, నాలుగు, ఐదు జలపాతాలు కనువిందు చేస్తాయి. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులు కనీసం వసతులు ఏమీ లేవు. టిఫిన్, భోజన సౌకర్యం, కనీసం టీ కూడా దొరకదు. అయితే పర్యాటకుల నుంచి ఒకరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. దీనికి తోడు ద్విచక్ర వాహనాలకు రూ.100, కార్లుకు రూ.300 చొప్పున అటవీ శాఖ వసూలూ చేస్తోంది. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేశారే గాని అది కేవలం తాగునీటికి మాత్రమే సరిపోతుంది. వర్షాకాలంలో సోలార్ కూడా పని చేయడం లేదు. అప్పుడు తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికీ ఆరె నుంచి జలపాతాలకు మట్టిరోడ్డే గతి. అయినా వందల సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్... జలపాతాల సమీపం వరకు తారు రోడ్డు, బస్సు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

పట్టించుకోండి సారూ..!

పల్లెవెలుగు బస్టాండులో సౌకర్యాలేవీ?



సీబీఎస్‌లోని పల్లెవెలుగు బస్టాండులో సౌకర్యాల లేమీ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఫ్యాన్లు, తాగునీరు అందుబాటులో లేవు. ఎండల తీవ్రత పెరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో అక్కడ వేచి ఉండే ప్రయాణికులు ఉక్కపోత, దాహంతో అల్లాడిపోతున్నారు. ఈ సమస్యలు కొన్ని రోజులుగా ఉన్న ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

\- తిరుపతి (ఆర్టీసీ)

వలసలను నివారించండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి, వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరుగుతున్నాయన్నారు. రోజుకు రూ.700 కూలి, 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులు జరిగే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఈ మేరకు డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామానాయుడు, హేమలత, దాసరి జనార్దన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్, నాయకులు చిన్నం పెంచలయ్య, మహేష్, బాటయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న రామానాయుడు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5(ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు, హేమలత విమర్శించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు రైతాంగం కడుపుకొట్టే విధంగా ఉన్నాయని తెలిపారు. సోమశిల-స్వర్ణముఖి కాలువలను పూర్తి చేసి, రాపూరు, డక్కిలి, వెంకటగిరి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాలకు సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. మల్లిమడుగును తొండమనాడు చెరువుకు అనుసంధానం చేయాలన్నారు. సోమశిల కాల్వను పూర్తిచేసి కల్యాణిడ్యాముకు అనుసంధానం చేయడం వల్ల తిరుమల, తిరుపతి దాహార్తి తీర్చవచ్చని తెలిపారు. మామిడి రైతులకు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. చెరకు రైతులకు బకాయిలను చెల్లించాలని కోరారు. కాగా, రెండు గంటలపాటు కూర్చుని బెట్టి అర్జీ తీసుకోకుండా ప్రజా సంఘాల పట్ల అనుచితంగా ప్రవర్తించిన జేసీపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో నరసింహులు రైతు నాయకుల పట్ల దురుసుగా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పద్మనాభరెడ్డి, గోవిందస్వామి, దాసరి జనార్దన్, చిన్నం పెంచులయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఎస్వీయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పద్మావతి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ వి.పద్మావతి నియమితులయ్యారు. ఇప్పటివరకూ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కేటీ రామకృష్ణారెడ్డి పదవీ కాలం ముగియడంతో ఆ స్థానంలో పద్మావతిని నియమిస్తూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె రెండేళ్ల పాటు ఈ స్థానంలో కొనసాగనున్నారు. కాగా, హెటిరో సైక్లిక్ కెమిస్ట్రీ ప్రత్యేకాంశంగా వర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పద్మావతి మూడు దశాబ్దాలకు పైగా బోధన, పరిశోధన అనుభవాన్ని గడించారు. ఆమె పర్యవేక్షణలో 33 పీహెచ్‌డీలు, 13 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. 10 రీసెర్చ్ ప్రాజెక్టులు నిర్వహించారు. 101 రీసెర్చ్ ఆర్టికల్స్ పబ్లిష్ అయ్యాయి. కెమిస్ట్రీ హెడ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ బీఓఎస్ ఛైర్‌పర్సన్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, సైన్స్ కాలేజీ వైస్-ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. 2022లో ఉత్తమ అధ్యాపక అవార్డు పొందారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి సీతమ్మ ట్రస్టు భూమిలో షాపింగ్ మాల్ నిర్మిస్తామని చెప్పి పలువురి నుంచి డబ్బు వసూలు చేసిన నలుగురిపై ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య వివరాల మేరకు... తిరుపతికి చెందిన మహేష్, సత్యనారాయణ, శిరీష, ప్రణీత్ సీతమ్మ భూముల్లో షాపింగ్ మాల్ నిర్మించి, ప్లాట్లు వేసి విక్రయిస్తామని చెప్పి వందలాది మంది నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. కన్యకా ఇన్‌ఫ్రా పేరుతో ట్రస్టు ఏర్పాటు చేశారు. దీనికి సత్యనారాయణ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. జీవకోనలో కాపురముంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉజ్వల్‌సింగ్ రెండు షాపుల కోసం రూ.రెండు లక్షలు చెల్లించాడు. ఏళ్లు గడుస్తున్నా షాపింగ్ మాల్ నిర్మించకపోవడంతో తన డబ్బు తిరిగివ్వాలని కోరాడు. మాయమాటలు చెబుతుండడంతో గట్టిగా నిలదీశాడు. దీంతో వారు చంపుతామని బెదిరించారు. ఈ క్రమంలో ఉజ్వల్‌సింగ్ బుధవారం ఎస్వీయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ రామయ్య వారిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలని కోర్టు ఆదేశించినట్లు సీఐ చెప్పారు.

తిరుపతి

నివాసాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల పరిధిలో 2019వ సంవత్సరానికి ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లోని ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గ్రామకంఠం, అనాధీనం, పొరంబోకు, గయాలు, పశువుల మేతబీడు వంటి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు మహిళల పేరుతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత సచివాలయ వీఆర్వోను సంప్రదించాలన్నారు. 150 గజాల వరకు ఉచిత రిజిస్ట్రేషన్ జరుగుతుందని, ఆపైన బేసిక్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



తనూజ్ విష్ణువర్ధన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశిష్టాద్వైత వేదాంత విభాగ పరిశోధకులు తనూజ్ విష్ణువర్ధన్ డాక్టరేట్ పొందారు. నయద్యుమని వ్యాఖ్యాయాః పాఠసమీక్షాత్మకం సంపాదనం అధ్యయనం చ అంశంపై ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్ పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఆయన గతంలో వేద వర్సిటీలోనూ పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు పరీక్షల అధికారి సాంబశివమూర్తి తెలిపారు.

రజకుల కోసం ఆధునిక దోబీఘాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న సావిత్రి

తిరుపతి(వైద్యం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): రజకుల సౌకర్యార్థం ఆధునిక దోబీఘాట్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర రజక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 50ఏళ్ల కిందట 56 దోబీఘాట్లు నిర్మించారని, అందులో 70 శాతం మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. కనీసం విద్యుత్తు, నీటి సదుపాయం లేవన్నారు. వీటి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు. టీటీడీ పాలకమండలిలో రజకులకు అవకాశం కల్పించాలన్నారు. రజక వృత్తిదారులకు విద్యుత్తులో రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నేతలు లక్ష్మయ్య, అశోక్, సుధాకర్, దినేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాలపై కార్మిక శాఖ దాడులు



బస్టాండులోని స్తంభాలకు స్టిక్కర్ అతికిస్తున్న అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 5(ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చిన్నలాలప్ప ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, సెంట్రల్ బస్టాండులలో బుధవారం దాడులు నిర్వహించారు. దుకాణాల్లో బాల కార్మికులు ఎవరైనా ఉన్నారా అని తనిఖీ చేశారు 18ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే యజమానిపై కేసు నమోదుతో పాటు రూ.50వేలు జరిమానా, 6నెలలు జైలుశిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఆ మేరకు బస్టాండులో స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో తిరుపతి లేబర్ ఆఫీసర్లు శ్రీమన్నారాయణ, ప్రవీణ్‌కుమార్, రాజయ్య, శ్రీకాళహస్తి లేబర్ ఆఫీసర్ రంగనాథన్ పాల్గొన్నారు.

బస్సుపాసుల కౌంటర్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

తిరుపతి(క్రీడలు), మార్చి 5(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌లోని ఏడుకొండల బస్టాండులో ఉన్న బస్సు పాసుల కేంద్రానికి బుధవారం మరమ్మతులు ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆ కౌంటర్ వద్ద పాసులు స్వీకరించే వారికి ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు గుర్తించారు. మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. వారాంతానికి పూర్తి చేయనున్నారు. అప్పటి వరకు తాత్కాలికంగా శ్రీనివాస బస్టాండులోని ప్లాట్‌ఫామ్ 27వద్ద బస్సుపాసులు జారీ చేస్తున్నారు.

రుయాస్పత్రి రూపురేఖలు మారుతున్నాయ్!

కలెక్టరు ఆదేశాలతో శరవేగంగా మౌలిక వసతుల కల్పన





ఓపీ కేంద్రం ముందు ఏర్పాటు చేసిన బోర్డు - అత్యవసర విభాగంలో వైద్యుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఛాంబర్

తిరుపతి(వైద్యం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. గతనెల 14వ తేదీన రుయాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్ అక్కడి సమస్యలపై అసహనం వ్యక్తం చేయడమేగాక అధికారులపై మండిపడిన విషయం విదితమే. మళ్లీ వచ్చేసరికి ఆస్పత్రి రూపురేఖలు మారాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఒకవైపు సమస్యలను పరిష్కరిస్తూ, మరోవైపు మౌలిక వసతుల కల్పన పనులు చేస్తున్నారు. అభివృద్ధి పనులను బుధవారం సూపరింటెండెంట్ రవిప్రభు పరిశీలించారు. భవిష్యత్తులో రోగులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్య పరీక్షల రిపోర్టులు ఏ రోజుకారోజు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఫార్మసీలో ఉన్న నిల్వ మందులను రీజనల్ స్టోర్‌లోకి మార్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. రక్తపరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వంటి సేవలు ఒకేచోట ఉండేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రోగులకు తాగునీరు, వారికి అందుబాటులో ఉండేందుకు సిబ్బందికి ఏర్పాటు చేశామన్నారు. ఆస్పత్రిలో పార్కింగ్ ఇబ్బందులను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. మరో రెండు నెలల్లో కార్పొరేటుకు దీటుగా రుయాస్పత్రిని తీర్చుదిద్దుతామని చెప్పారు.

చెరువులు, కాలువలు ఆక్రమిస్తే ఉపేక్షించం

కమిషనర్ ఎన్.మౌర్య



చెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, అధికారులు

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో చెరువులు, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఉపేక్షించమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాన్ చెరువు, గణేష్ లేఔట్, సాయి విష్ణు లేఔట్, జన చైతన్య లేఔట్, అన్నమయ్య మార్గం రోడ్డు తదితర ప్రాంతాలను డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి బుధవారం ఆమె పరిశీలించారు. పాన్ చెరువులో అనధికార నిర్మాణాలు చేస్తున్నారని, పలు లేఔట్లలో కాలువలు ఆక్రమించినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, కాలువల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చూడాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతు మాధవ్, డీసీపీ మహాపాత్ర, ఏసీపీలు బాలాజీ, మూర్తి, డీఈ రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

సీఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్

తిరుపతి (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీఏ ఇన్‌స్టిట్యూట్ న్యూఢిల్లీ వారు బుధవారం విడుదల చేసిన సీఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. సాయి ప్రమోద్ 321, మనోజ్ 320 మార్కులతో టాపర్లుగా నిలిచి 59.37 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఇక ఫౌండేషన్ కోర్సులో ఎస్.ఐ.నందిని, డి.పల్లవి, డి.మీన, పి.చందనప్రియ, కె.రిషిత టాపర్లుగా నిలిచారని చెప్పారు. మొత్తంగా ఎమరాల్డ్స్ విద్యార్థులు 68.76 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని డైరెక్టర్లు అభినందించారు.

8 నుంచి సీఐటీయూ వర్క్‌షాపు

తిరుపతి(ఆటోనగర్) మార్చి5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సీఐటీయూ రాయలసీమ స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థాపకులు బాలానందన్ శత జయంతి సభ అనంతరం వర్క్‌షాపు ప్రారంభమవుతుందని, రాష్ట్ర నాయకులు ఏవీ నాగేశ్వర రావు, సీహెచ్ నరసింగరావు పాల్గొంటారని తెలిపారు.

సైన్స్ ఉపాధ్యాయులకు స్టెమ్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ



ఉపాధ్యాయులతో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్

తిరుపతి(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు స్టెమ్ ఎడ్యుకేషన్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం తిరుపతిలో జరిగింది. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. పలు సాంకేతిక అంశాలను ప్రయోగాత్మకంగా బోధించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని మెరుగుపరుస్తుందన్నా రు. స్మైల్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ ఎం.కిషోర్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.విజయ్ సారథి పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీలో ప్రకృతి ఉత్పత్తుల మేళా



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీన్ విజయలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం ప్రారంభమైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేళాను వర్సిటీ డీన్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళల కోసం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మహిళల చేతుల మీదుగానే విక్రయించడం ఈ మేళా ప్రత్యేకతన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ ప్రొఫెసర్ శారా సరోజిని, ఉమెన్ స్టడీస్ హెడ్ నీరజ, అధ్యాపకులు సుచరిత, కోనప్రభ, రాణి, ఉమ, హేమావతి, ప్రీతి, ఇంద్రాణి, భువనేశ్వరి, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

ఇది బైక్ స్టాండ్ కాదు.. బస్టాండు



డిపో గ్యారేజీ ముఖద్వారం అడ్డుగా టూవీలర్ పార్కింగ్



చెన్నై ప్లాట్‌ఫాం కనబడకుండా టూవీలర్స్ పార్కింగ్



కాణిపాకం స్టాపింగ్ టాయిలెట్ వెనుక టూవీలర్ పార్కింగ్

ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో ఎటుచూసినా ద్విచక్ర వాహనాలు కనిపిస్తున్నాయి. ఖాళీ స్థలం, అది కూడా నీడ ఉండే జాగాలను గుర్తించి ద్విచక్ర వాహనాలను ఆపేస్తున్నారు. తద్వారా బస్సుల రాకపోకలకు, ప్రయాణికుల సంచారానికి స్థలాభావం ఏర్పడుతోంది. అద్దె పార్కింగ్ స్థలాలున్నా అక్కడికి వెళ్లకుండా ఉచిత స్థలాలనే ఎంచుకుంటున్నారు. ప్రధాన ద్వారం ముందు, పల్లెవెలుగు బస్టాండు నుంచి వెలుపల వచ్చే దారి, కాణిపాకం మరుగుదొడ్లకు ఆనుకుని, ఎలక్ట్రిక్ బస్సు చార్జింగ్, కార్గో కేంద్రాలు, చెన్నై ప్లాట్‌ఫామ్, బస్సులు వెలుపలకు వచ్చే మార్గంలో ద్విచక్ర వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రధానంగా డిపో గ్యారేజీ గేటు వద్ద ఉద్యోగులే ఇష్టారాజ్యంగా పార్కు చేస్తున్నారు. ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్న ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

\- తిరుపతి(ఆర్టీసీ)



బస్సుల స్థానంలో ద్విచక్ర వాహనాలు



జెర్రిపోతు

పట్టుబడిన నాగుపాము

వామ్మో!

ఒకే రోజు ఆందోళన పెట్టిన నాగుపాము, జెర్రిపోతు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో బుధవారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. గాలిగోపురం వద్ద జనసంచారంలోకి వచ్చిన నాగుపాము భక్తులను ఆందోళన పెట్టింది. సమాచారంతో భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దానిని బంధించారు. అలాగే తిరుమల సేవా సదన్‌కు సమీపంలో ఉన్న గార్డెన్‌లోనూ ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు. ఈ పాములను అడవిలో విడిచిపెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. శ్రీపాదరాజ మఠాధిపతి సుజయ నిధితీర్థ స్వామిజీ, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్కే రోజా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







సుజయనిధితీర్థ స్వామిజీ - ఆర్కే రోజా - సబితా ఇంద్రారెడ్డి

సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,861

తలనీలాలు సమర్పించినవారు: 19,639



గురుకులం పిలుస్తోంది

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది పాఠశాలల్లో 600 సీట్లున్నాయి. బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ఈనెల 15లోగా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలల్లో 600 సీట్లు

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈనెల 15

ఏప్రిల్ 25, 27, 28 తేదీల్లో ప్రవేశ పరీక్షలు



తిరుపతిలోని బీసీ గురుకుల పాఠశాల భవనం

పాఠశాలలు - సీట్లు

ప్రాంతం	కేటగిరీ	కేటాయించిన సీట్లు
తిరుపతి	బాలికలు	80
పీలేరు	బాలికలు	80
కలికిరి	బాలికలు	80
పెద్దపంజాణి	బాలికలు	40
పులిచెర్ల	బాలికలు	40
సదుం	బాలురు	80
సత్యవేడు	బాలురు	80
ఐతేపల్లి (తిరుపతి)	బాలురు	40
అంగళ్లు	బాలురు	40
కుప్పం	బాలురు	40

అర్హులు ఎవరంటే?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులకు 11, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదు. పాత జిల్లాల ప్రకారం గురుకుల్లో అడ్మిషన్లు ఉంటాయి.

దరఖాస్తు విధానం

అర్హులు ఆన్‌లైన్‌లో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి https://mjapapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, కేటగిరీ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు. ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 25న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.

సదుపాయాలు : ఉచిత వసతి, పౌష్టికాహారం, మూడు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు లాంటివి ప్రభుత్వం సమకూర్చుతుంది. కాస్మొటిక్ చార్జీలను కూడా చెల్లిస్తుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు. యోగా, మ్యూజిక్, ఆర్ట్స్‌లోనూ శిక్షణ ఇస్తారు.

అంబేడ్కర్ గురుకులాలకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

ఉమ్మడి జిల్లాలోని 15 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సర ప్రవేశానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించనున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు చదువుకోవచ్చు. వసతి, భోజనం, పుస్తకాలు సహా అన్నీ ఉచితమే.

అర్హతలు:

- 5వ తరగతిలో ప్రవేశం పొందగోరు ఎస్సీ, ఎస్టీ బాలికలు 2012 సెప్టెంబరు 1- 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, బీసీ సీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1వతేదీ -2016 ఆగస్టు 31 మధ్య జన్మించినవారై ఉండాలి.
- ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు అర్హులు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షకు మించరాదు.

పాఠశాలలు - సీట్లు:

రామకుప్పం, బి. కొత్తకోట, పూతలపట్టు, కుప్పం (విజయపురం)లో బాలుర పాఠశాలలు కాగా శ్రీకాళహస్తి, చిత్తూరు, పీలేరు, బురకాయలకోట, పలమనేరు, సత్యవేడు, పుత్తూరు, మదనపల్లు, కుప్పం, వాల్మీకిపురం, జీడీనెల్లూరుల్లో బాలికల పాఠశాలలున్నాయి. తరగతికి 80 చొప్పున సీట్లు ఉంటాయి. జూనియర్ ఇంటర్‌లో 40, సీనియర్ ఇంటర్‌లో 40 సీట్లున్నాయి.

శాస్త్రోక్తంగా వేద పారాయణం





వేద పారాయణం చేస్తున్న పండితులు - ధూర్జటి కళాప్రాంగణంలో పారాయణం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకొని బుధవారం ఉదయం వేద పారాయణ సభ శాస్త్రోక్తంగా జరిగింది. ఉత్సవాల్లో చివరి రోజు వేద సభ జరగడం ఆలయ సంప్రదాయం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రముఖ దేవాలయాల నుంచి 100మంది ఘనాపాటిలైన వేద పండితులు ఆలయానికి విచ్చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఋగ్వేదం, సామవేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం బృందాలుగా పండితులు ఆశీనులయ్యారు. అనంతరం వేదాలను పఠించారు. వేద ఘోషలో ధ్వనించిన దివ్య శబ్ద తరంగాలతో వాయులింగేశ్వర క్షేత్రంలో భక్తులు పరవశించారు. అదే విధంగా ధూర్జటి కళా ప్రాంగణంలో కూడా వేదఘోష జరిగింది. అనంతరం ఈవో బాపిరెడ్డికి వేద పండితులు ఆశీర్వాదం అందజేశారు. వేద సభలో పాల్గొన్న పండితులకు ప్రత్యేక దర్శన ఏర్పాటు తర్వాత ఆలయ లాంఛనాలతో ఘనంగా సత్కరించారు. అలాగే స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం

● మంత్రుల సమీక్షలు సఫలీకృతం ● అధికారుల సమన్వయంపై భక్తుల సంతృప్తి

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. గత నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాల పర్యవేక్షణ కోసం హోం మంత్రి అనిత, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కమిటీ ఏర్పాటు చేయించారు. మంత్రులు స్వయంగా శ్రీకాళహస్తికి చేరుకుని ఎమ్మెల్యే సుధీర్‌తో పాటు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అలాగే కలెక్టర్ పలుమార్లు శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. ఉత్సవాల దృష్ట్యా నెల రోజుల ముందే సన్నిధి వీధి, రాజగోపురం వద్ద రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే సుధీర్ చేయించారు. అలాగే తిరుపతి రోడ్డులో మరమ్మతులు చేయడం, గిరిప్రదక్షిణ సాగే పట్టణంలోని తెలుగుగంగ కాలనీరోడ్డును బాగుచేయడంతో ఉత్సవాల సందర్భంగా రాకపోకలకు ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయి. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పలుమార్లు శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఆయన స్వయంగా పట్టణ నలుమూలలో సంచరించి శివారు ప్రాంతాల్లో 11 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య భక్తులకు దూరమైంది.



ఆలయంలో భక్తుల రద్దీ

ఇక ఎస్పీ, ఈవో బాపిరెడ్డి మహాశివరాత్రి రోజున స్వయంగా క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సామాన్య భక్తులు త్వరితగతిన దర్శనం పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఉచిత లడ్డూ ప్రసాదం వితరణ, మహిళలకు వాయనం ఇవ్వడం భక్తులను సంతోష పరిచింది. ఈ యేడాది శివరాత్రి రోజున పెద్దఎత్తున ప్రముఖులు ముక్కంటి ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక ధ్వజావరోహణం రోజున తప్ప మిగతావన్నీ సమయపాలనతో సాగడంపై భక్తులు హర్షించారు. మౌలిక వసతులు కూడా భక్తులకు సంవృద్ధిగా ఏర్పాటు చేశారు. మొత్తంగా మంత్రుల సమీక్షలు ఉత్సవాల విజయవంతం కావడానికి బాటలు వేశాయి.

ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.35 లక్షల విలువైన బంగారు, 2116 గ్రాముల వెండి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను తిరుపతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం శివజ్యోతినగర్‌కు చెందిన ముత్తాల అరుణ్, డేరంగుల జగదీష్, ముత్తాల తేజస్, బాలాయపల్లి మండలం వెంగమాంబపురానికి చెందిన అక్కుర్తి నవీన్, అక్కుర్తి పెంచలయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంకు చెందిన పి.విఘ్నేష్, బీటీఆర్ కాలనీకి చెందిన లోకనాథరెడ్డి స్నేహితులు. తొలినుంచీ ఈజీ మనీకి అలవాటు పడ్డారు. మద్యానికి బానిసయ్యారు. చెడు అలవాట్లు అలవడటంతో డబ్బు కోసం ఇంటి దొంగతనాల వైపు అడుగేశారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కీలకం. కొన్నేళ్లుగా తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలకు పాల్పడేవారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని పగటి పూట రెక్కీ నిర్వహించేవారు. రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో తిరుపతి రూరల్ తిరుచానూరులోని శంకర్ నాయుడు కాలనీలో ఉంటున్న అంబుజ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దీనిని గమనించిన ఈ ఏడుగురు.. ఓ రాత్రి వేళ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువా, అల్మారాల్లోని అలమరాల్లో వున్న బంగారు నగలు, డబ్బులు, వెండి వస్తువులు అపహరించుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుచానూరు సీఐ సునీల్ అప్పట్లో కేసు నమోదు చేశారు.

నిఘా ఉంచి.. పట్టుకుని

ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, అరుణ, జగన్నాథ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది ప్రభాకర్, ప్రసాద్, ఎల్‌బీ ప్రసాద్ బృందాలుగా నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో సీఐ సునీల్‌కుమార్ బృందం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముళ్ళపూడి క్రాస్ వద్ద అనుమానంగా తిరుగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు శంకర్‌నాయుడు కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. వీరి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన 501 గ్రాముల బంగారు నగలు, 2116 గ్రాముల వెండి ఆభరణాలు, కారు, ఆటో, స్కూటరును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని ముత్తాల అరుణ్‌పై 29 కేసులు, అక్కుర్తి నవీన్‌పై 11 కేసులు, పెంచలయ్యపై 18 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. ఈ ముఠాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.



దొంగల అరెస్టును చూపి.. మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నేలపట్టులో ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఎకో సెన్సిటివ్ జోన్ కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దొరవారి సత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నుంచి 2కి.మీ. విస్తీర్ణాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అక్కరపాకు, మైలంగం, ముచ్చలగుంట, నెలబల్లి, నెల్లూరుపల్లి, వెంగమాంబపురం, ఏకొల్లు, నేలపట్టు తదితర రెవెన్యూ గ్రామాల్లో ఇది ఉంటుందని వెల్లడించారు. పర్యావరణంతో పాటు టూరిజం, వ్యవసాయ, ఉద్యానవనం, మత్స్యశాఖ చేపట్టాల్సిన అంశాలపై చర్చించి మ్యాప్ రూపొందించాలని సూచించారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఈ మాస్టర్ ప్లాన్‌లో అధికారులందరూ భాగస్వాములు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట డివిజన్ డీఎఫ్‌వో హారిక, అడిషనల్ డీఎఫ్‌వో నాగభూషణ్, అధికారులు జయచంద్ర, వినోద్, సౌజన్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులపైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

తమిళనాడుకు చెందిన మహిళ మృతి



తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): బైకుపై వేగంగా వస్తూ అదుపు చేయలేకపోయాడు. కొండకు నడిచి వెళుతున్న భక్తులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తమిళనాడుకు చెందిన వీరమ్మాల్(60) మృతిచెందారు. ఈ ఘటన బుధవారం తిరుపతి నగరం ఇస్కాన్ ఆలయం వద్ద చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ అజిత తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన చంద్రశేఖర్ బైకుపై అన్నారావు సర్కిల్ మీదుగా ఇస్కాన్ రోడ్డు వైపు వెళుతున్నాడు. అదే సమయంలో తమిళనాడు రాష్ట్రం కాంచీపురం తాలూకా నల్లూరు గ్రామానికి చెందిన వీరమ్మాల్(60) కుటుంబ సభ్యులతో కలిసి నడుచుకుంటూ తిరుమల కొండకు వెళుతున్నారు. ఇస్కాన్ ఆలయం వద్దకు వీరు వెళుతుండగా.. బైకుపై వేగంగా వెళుతున్న చంద్రశేఖర్ అదుపు తప్పి వీరమ్మాల్‌ను ఢీకొన్నాడు. కింద పడటంతో ఆమె తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు 31 వరకు కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కుంభమేళా కోసం రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లలో కొన్నింటిని ఈనెల 8 నుంచి 31వ తేదీ వరకు, మరికొన్నింటిని 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. తిరుపతి-కదిరి దేవరపల్లి (57405-57406), తిరుపతి-గుంతకల్లు(57403-57404), తిరుపతి-హుబ్లీ (57401-57402) మధ్య రాకపోకలు సాగించే రైళ్లను ఈనెల 31 వరకు, తిరుపతి-కాట్పాడి మధ్య నడిచే ఆరు డెము ప్యాసింజర్లను ఈనెల 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నామని వివరించారు.

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ



అపాచీ పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంపై పరిశ్రమలు సైతం వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం తడలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం హెల్మెట్ ధరించని ఉద్యోగులను లోనికి అనుమతించేది లేదంటూ నిబంధన విధించిన విషయం తెలిసిందే. తాజాగా మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమ ఈనెల 17నుంచి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంలో విధులకు వచ్చే ఉద్యోగులను లోనికి అనుమతించేది లేదంటూ బోర్డు ఏర్పాటు చేసింది.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 540 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 540 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆంగ్ల భాష పరీక్ష జరిగింది. 29,131 మంది విద్యార్థులకుగాను 28,591 మంది పరీక్షలు రాశారు. 540 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

ఎస్వీయూ దూరవిద్య పీజీ నోటిఫికేషన్ విడుదల



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ దూరవిద్యా పీజీ నోటిఫికేషన్ విడుదలైంది. 2025 సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్ బాబు తదితరులు బుధవారం విడుదల చేశారు. 17 పీజీ, 2 డిప్లొమో కోర్సులకు ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు చెప్పారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్‌సి కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువరించామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచీ 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూసీడీఓఈ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కోరారు. సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ వరదరాజన్ తదితరులు పాల్గొన్నారు.

జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు



బాలాయపల్లి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్

బాలాయపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని జయంపులో పీహెచ్‌పీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఈ నెల ఒకటవ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటయ్యేనా అన్న కథనానికి ఆయన స్పందించారు. బుధవారం జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటుకు ఒక గదిని పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గర్భిణుల నమోదు, ఓపీ తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ల్యాబ్, వార్డు, ప్రసవాల గదులను పరిశీలించారు. కొన్ని గదుల్లో శ్లాబ్ పెచ్చులూడుతుండడాన్ని గుర్తించిన ఆయన మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లిఖిత, లియోనా పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యంతో పాటు రోగులకు అధునాతన వసతులు కల్పిస్తున్నామని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. కోట మండలం చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్‌లు, బెడ్‌లను, సిబ్బంది హజరు పట్టీలను పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నాగరాజుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ



నిడిగుర్తి ప్రభుత్వాస్పత్రిలో మహిళా సిబ్బంది మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ

వాకాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం, నిడిగుర్తి ప్రభుత్వాస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రి పరిధిలోని దళితవాడకు చెందిన చరణ్ ఇటీవల పాముకాటుతో మృతిచెందిన ఘనటపై పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే నిడిగుర్తి ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణపై మహిళా సిబ్బంది ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా ఆస్పత్రుల్లో సూపర్‌వైజర్లు నరేష్‌బాబు, హిదైతుల్లా బృందంతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ విచారణ చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కి నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఏఆర్ ల్యాబ్ ద్వారా మెరుగైన బోధన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆగ్మెంటెట్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ ల్యాబ్ ద్వారా మెరుగైన బోధనను అందించవచ్చునని గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో ఆగ్మెంటెట్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గణితం, సైన్స్ విభాగాల్లో హోలో క్యూబ్స్ ద్వారా కష్టమైన అంశాలను ఆసక్తికరంగా, సులభతరంగా నేర్చుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యుగంలో విద్యార్థులకు సాంకేతికతో కూడిన బోధన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంద్రాణి, రాజు, ఆంజనేయులు, ఇమ్రాన్, శ్రీహరి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తమ్మినపట్నం, కొత్తపట్నంలో గ్రామసభలు

చిల్లకూరు, కోట మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం, కోట మండలంలోని కొత్తపట్నం సచివాలయాల్లో గురువారం సబ్‌కలెక్టర్ రామచేంద్ర ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు శ్రీనివాసులు, జయజయరావు తెలిపారు. చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టుకు భూములకు నష్టపరిహారం పొంద డానికి లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో వెల్లడించడం జరుగుతుందన్నారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 7 రోజుల లోపు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తగిన ఆధారాలతో తెలియజేయాలని తహసీల్దారు సూచించారు.

శాసనసభ అంచనాల కమిటీ సమావేశంలో పాశం

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన బుధవారం విజయవాడలో శాసనసభ అంచనాల కమిటీ, ప్రజాపద్దుల కమిటీ, ప్రభుత్వ సంస్థల కమిటీ సమావేశాలు జరిగాయి. అంచనాల కమిటీలో సమావేశంలో సభ్యుడైన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మన్నారుపోలూరు ఆలయ భూముల వేలం

సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరు కృష్ణస్వామి ఆలయ భూములకు రెవెన్యూ, టీటీడీ అధికారుల సమక్షంలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. ఆలయానికి సంబంధించి ఇలుపూరు, నూకలపాలెం, మన్నెముత్తేరి గ్రామాల్లో 20.80 ఎకరాల భూములున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, సర్వేయర్ బాలాజి, వీఆర్వోలు శ్రీదేవి, హైమావతి పాల్గొన్నారు.

అర్హులైన వారికి బీసీ కార్పొరేషన్ రుణాలు

నాయుడుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అన్నివిధాలుగా అర్హులైన వారికి బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరవుతాయని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు అందిన దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలించారు. మండలానికి 26 యూనిట్లు మంజూరు కాగా 219 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ప్రభుత్వ సర్వేలను వేగవంతంగా నిర్వహించాలి

నాయుడుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 9 సర్వేలను వేగవంతంగా, సంపూర్ణంగా నిర్వహించిన నివేదకలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. బుధవారం పలు సచివాలయాలను తనిఖీ చేశారు. సర్వేలను నిర్లక్ష్యం చేస్తే నోటీసులు జారీ చేస్తామన్నారు.



బేరిపేట సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

కొండూరు చెరువులో యువతి మృతదేహం

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మాంబట్టు సెజ్ రోడ్డు సమీపంలోని కొండూరు చెరువులో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చెరువులో మృతదేహం తేలియాడుతున్నట్లు స్థానికుల నుంచి బుధవారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ కొండప్పనాయుడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఒరిస్సా రాష్ట్రానికి సంబంధించి ఓ బట్టలషాపు కవరు, అందులో కొన్ని దుస్తులు తప్ప ఇతర ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 20నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని, కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో మూడు, నాలుగు రోజుల క్రితం యువతి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహంపై ఎటువంటి గాయాలు కనిపించలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కొండప్పనాయుడు తెలిపారు. ఘటనా స్థలాన్ని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ కూడా పరిశీలించారు.

10న పెన్షనర్ల సమావేశం

గూడూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 10వ తేదీన పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు మెహబూబ్ బాషా బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు బొల్లినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. పెన్షనర్లు హాజరై వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతి లేకుండానే లేఅవుట్ నిర్మాణం

స్థలాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చకుండానే పనులు ● నోటీసులతో సరిపెట్టిన అధికారులు



అక్రమ లేఅవుట్‌లో చేపట్టిన రోడ్ల నిర్మాణం

సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం ఇటు చెన్నై అటు నెల్లూరుకు మధ్యలోనే కాకుండా పారిశ్రామివాడలకు దగ్గరగా ఉండడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో కొందరు అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి క్రయవిక్రయాలు చేసేస్తున్నారు. వీరికి కొందరు అధికారులు, నేతలు సహకరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు అడ్డే లేకుండాపోవడంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుల్లా వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగానే సాగుతోంది. సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డున అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి కాలువలు, రోడ్ల నిర్మాణం చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నసత్రం ఆనుకోని సూళ్లూరు జప్తు కట్టుబడి రెవెన్యూలో సర్వే నంబరు1-1బిలో 0.45 సెంట్లు, 1-2ఏలో 0.40 సెంట్లు, 1-5లో 0.52 సెంట్లతో కలిపి మొత్తం 1.37 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. దీనికి వ్యవసాయేతర భూమిగా మార్పు చేయకుండా లేఅవుట్ వేశారు. ఇందులో కాలువలు, రోడ్లను నిర్మిస్తున్నారు. లేఅవుట్ వేయాలంటే ముందస్తుగా సదరు స్థలాన్ని వ్యవసాయేతర భూమికి మార్పు చేయాలి. ఇందుకు సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాక ఆర్డీవో సదరు భూమిని పరిశీలిస్తారు. స్థలం విలువను బట్టి చలానా చెల్లించాక భూమార్పిడి జరుగుతుంది. సూళ్లూరు జప్తు కట్టుబడిలోని 1.37 ఎకరాల స్థలం ఇంకా వ్యవసాయ భూమిగానే రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అంటే నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసినట్లు స్పష్టమవుతోంది. గత ఏడాది డిసెంబరులోనే ఈ లేఅవుట్ వేసేందుకు భూమిని చదును చేసి పక్కనే ఉన్న లేఅవుట్‌లోకి రోడ్డును అనుసంధానం చేసి సైడ్ కాలువలు నిర్మించారు. అప్పట్లో అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం లేఅవుట్‌లో రోడ్ల నిర్మాణంతో పాటు, ఇతర పనులు వేగంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ సంబంధం లేదనట్లుగా ఉంటున్నారు.

కాళంగి వంతెన, గ్రాయిన్ నిర్మాణానికి నిధులు కేటాయించండి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయం సమీపంలో కాళంగి నదిపై ఉన్న వంతెన పునఃనిర్మాణానికి, అదేవిధంగా కాళంగి గ్రాయిన్‌కు నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. మంగళవారం అమరావతిలోని శాసనసభ ప్రాగణంలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ప్రస్తుతం ఉన్న వంతెన బ్రిటీష్ కాలం నాటిదని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పునఃనిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు రూ.35 కోట్లు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అదేవిధంగా పులికాట్ సరస్సులోని ఉప్పునీరు కాళంగి నదిలో కలిసిపోకుండా తడ మండలం వాటంబేడు వద్ద గ్రాయిన్‌ను నిర్మించాల్సి వుందని, ఇందుకు రూ.23 కోట్లుతో నివేదికలు తయారయ్యాయని చెప్పారు. స్పందించిన సీఎం పరిశీలించి నిధులు కేటాయిస్తామని హమీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కూడా సీఎంను కలిశారు.

బైక్‌లో మంటలు



సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం బాపూజీ వీధిలోని ఓ దుకాణం ముందు పార్కింగ్ చేసిన పల్సర్ బైక్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు.... తడ మండలం బీములవారిపాలెం గ్రామానికి చెందిన ప్రతాప్ స్నేహితుడితో కలిసి బుధవారం సూళ్లూరుపేటకు పల్సర్ బైక్‌లో వచ్చారు. బాపూజీ వీధిలోని ఓ దుకాణం ముందు ఆపి గిఫ్ట్ కొనుక్కునేందుకు వెళ్లారు. ఇంతలో బైక్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను ఆరిపేందుకు ప్రయత్నించినా 90 శాతానికి పైగా కాలిపోయింది.

మండలాభివృద్ధికి నిధులివ్వండి



మంత్రి ఆనంతో టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 5 (ఆంధ్రజోతి): మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని పెళ్లకూరు మండలానికి చెందిన టీడీపీ నేతలు బుధవారం అమరావతిలో కలిశారు. మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు ఉన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరగనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గూడూరులోని జనసేన కార్యాలయంలో ఛలో పిఠాపురం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మోహన్, వంశీకృష్ణ, కుమార్, సాయికిరణ్, పెంచలయ్య, సుమన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

గూడూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఆ శాఖ ఈఈ నరేంద్రరెడ్డి అన్నారు బుధవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను లైన్‌మెన్‌లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం నూతనంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం మార్పులపై అవగాహన పెంచుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శేషాద్రి, భాస్కర్, శ్రీహరిబాబు, ఏడుకొండలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ వ్యవస్థాపకుడికి నివాళి

సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఎన్‌ఎంయూ వ్యవస్థాపకుడు రామ్మోహన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు శేఖర్, పోలయ్య, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, భాస్కర్, షాజహాన్, సుబ్బయ్య, శశిధర్, మాధవ్ పాల్గొన్నారు.

సర్వేలను పక్కాగా నిర్వహించాలి

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను పక్కాగా నిర్వహించాలని జిల్లా సచివాలయ అధికారి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం తడకండ్రిగ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయానికి సర్వేలన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తళా గాబ్రియేల్, మస్తాన్, శేషారావు, పద్మా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



వెండిచీర అలంకారంలో రాజరాజేశ్వరీదేవి

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గణపతి పూజ, హోమపూజలు, కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారిని వెండిచీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం చేపట్టి అమ్మవారికి వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఏలూరు వరదారెడ్డి, ఇంద్రసేనా మంజునాథరెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, కొండూరు కోదండరామయ్య, సుబ్రహ్మణ్యం దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, మాధవనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం అమరావతిలో కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెపూడి పంచాయతీలోని లక్ష్మక్కకండ్రిగలో బుధవారం కుక్కల దాడిలో జింక మృతిచెంది. కేశవరం అటవీ ప్రాంతంలోని జింక దాహార్తిని తీర్చుకునేందుకు లక్ష్మక్కకండ్రిగ పొలాల్లోకి వచ్చింది. కుక్కలు వెంబడించి దాడి చేయగా రక్తగాయాలతో స్థానిక కూటాలమ్మ దేవాలయం వద్ద పడిపోయి మృతిచెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకువెళ్లారు.

పేదలకు దుస్తుల అందజేత

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం విష్ణువర్ధన్ దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రెడ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణమ్మ, విష్ణువందన, తనూజ, స్నేహలత, లక్ష్మి, జానా సుధీర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో పూడికతీతను అడ్డుకున్న గ్రామస్తులు

నాయుడుపేట/పెళ్లకూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో చేపట్టిన పూడికతీత పనులను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని కోట మండలం గూడలి, పెళ్లకూరు మండలం దిగువ కలవకూరు, పుల్లూరు స్వర్ణముఖిది ఆనకట్టకు ఎగువ, దిగువ ప్రాంతాల్లో పూడికతీతకు ప్రభుత్వం ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ దిగువ కలవకూరు వద్ద వాహనాల రాకపోకలు జరిగేలా తాత్కాలిక రోడ్డును వేసి మంగళవారం పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నింబంధనల ప్రకారం మనుషులతో పూడికతీత చేపట్టాల్సి ఉండగా యంత్రాలతో పనులు ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న రైతులకు సంబంధించిన సాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఇది గమనించిన రైతులు బుధవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూడికతీతకు పనులను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులను ఆపేశారు.

కమనీయం... సీతారాముల కల్యాణం



స్వామి, అమ్మవార్లకు వివాహనం జరిపిస్తున్న వేదపండితులు

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామసుందర పురంలో బుధవారం సీతారామధార్మిక సంస్థ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. స్థానిక సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రవాస భారతీయులు వెంకట్రామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల సహకారంతో కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ తంతును వేద పండితులు అనంతాచార్యులు, సాయిబాబా, నరేష్ కళ్లకు కట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో అల్లం రమణయ్య, శరవణ, బాలాజీ, సుబ్రమణ్యం, అన్నపూర్ణా తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి



ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో డీఎల్పీవో వెంకటరమణ, ఎంపీడీవో మనోహర్ గౌడ్ తదితరులు

చిట్టమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ కోరారు. బుధవారం మండలంలోని మల్లాం గ్రామంలో ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించడం వల్ల పంచాయతీల్లోని మౌలిక వసతులు కల్పనకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, గూడూరు డివిజన్ రిసోర్స్ పర్సన్ రవి, ఇన్‌చార్జి ఇవోపీఆర్డీ జనార్దన్, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, మల్లాం పంచాయతీ కార్యదర్శి ఆనందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలి

నాయుడుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుందా డిమాండ్ చేశారు. నాయుడుపేట మండలం చిగురుపాడులో ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. కూలీలకు పని ముట్లు అందించలేదని, తాగునీరు, విశ్రాంతి తీసుకునే సదుపాయం లేనట్లు గుర్తించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు అందజేయాలన్నారు.

పీ-4 సర్వేని విజయవంతంగా నిర్వహించాలి

వాకాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పీ-4 సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని నిడిగుర్తి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీ-4 సర్వే(పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్ట్నర్‌షిప్) ద్వారా అత్యంత పేదరికం కలిగిన 20శాతం మందిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మస్తానయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా దినోత్సవం

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, ప్రకాశం కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ పిల్లల్లో పోషణ లోపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బాల్య వివాహాల నిర్మూలన, ప్రతి ఆడపిల్ల చదవాలి అనే నినాదాలతో ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కవిత, ఆర్‌వీరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని సరిదిద్దేది మహిళలే

దక్కిలి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటితో పాటు సమాజాన్ని సరిదిద్దేది మహిళలేనని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. బుధవారం దక్కిలిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, హక్కులు, విద్య, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీవో జమునారాణి, ఎస్ఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదాపై జగన్ రాద్ధాంతం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ సంఘ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో సాంకేతి కపరంగా రాని ప్రతిపక్ష హోదాపై మాజీ ముఖ్యమంత్రి జగన్ రాద్ధాంతం చేస్తున్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శాసనసభ చట్టాల ప్రకారం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు అనుసరించి జగన్‌కు ప్రతిపక్ష హోదా పొందే అవకాశమే లేదన్నారు. ఆయనకు పులివెందుల ఎమ్మెల్యే పదవే ఎక్కువ అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదాపై స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై నిందారోపణలతో లేఖ రాయడం జగన్ అహంకార ధోరణి తెలుపుతోందన్నారు. జగన్ అధికారంలో ఉన్నపుడు ప్రజలను కలవకపోవడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీకి రాకపోవడం సహజమన్నారు. ఒక ఎమ్మెల్యేగా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన ఆయన ప్రతిపక్ష హోదాపై మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. హోదా ముఖ్యమా.. ప్రజా సమస్యలు చర్చించడం ముఖ్యమా అని ప్రజలు ఆయన తీరుపై చర్చించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర వన్నియకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్ మిన్నల రవి, బీసీ నాయకులు నెమళ్లూరు బుజ్జి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేలంతో రూ.9.21 లక్షల ఆదాయం

నారాయణవనం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ నారాయణవనంలో ఆదాయ వనరులను 2025-26 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ వేలం బుధవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో శ్రీకాళహస్తి డివిజనల్ పంచాయతీ అధికారి బి.ప్రభురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టూరిస్ట్ బస్టాండు, వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, ఆటోస్టాండ్, జంతు వధశాల, బస్టాండులోని పంచాయతీ గదులను వేలం వేశారు. దినసరి కూరగాయల మార్కెట్ ద్వారా రూ.60,800, టూరిస్ట్ బస్టాండ్ ద్వారా రూ.7.25 లక్షలు, ఆటో స్టాండ్ ద్వారా రూ1.13 లక్షలు, జంతు వధశాల ద్వారా రూ.23 వేలు ఆదాయం వచ్చిందని ఈవో షణ్ముగం చెప్పారు. వారపు సంత వేలంలో ఒక్కరే హాజరు కావడంతో వేలాన్ని వాయిదా వేశారు. ఏప్రిల్ 1 నుంచి వసూళ్లకు అనుమతిస్తామని తెలిపారు.

స్కౌట్స్‌తో సేవాభావం



యూనిఫాంను పంపిణీ చేస్తున్న ఎంఈవో, ప్రిన్సిపాల్

సత్యవేడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్‌లో చేరడం వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం, సేవాభావం అలవడుతుందని ఎంఈవో రవి తెలిపారు. బుధవారం మహాత్మ జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కౌట్స్ యూనిఫాంను పంపిణీ చేశారు. మండలంలో స్కౌట్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్, స్కౌట్స్ మాస్టర్లు మల్లికార్జున, రత్నకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాట్‌బాల్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



కేవీబీపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో ఇటీవల జరిగిన సబ్ జూనియర్ సౌత్‌జోన్ షాట్‌బాల్‌లో నేషనల్ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచారు. 9వ తరగతి చదువుతున్న మధుమిత, నవనీత జట్టుకు ఎంపికయ్యారు. మధుమితను సబ్‌జూనియర్ టీంకు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ సుకన్య, ఇతర ఉపాధ్యాయులు వీరికి శిక్షణ ఇచ్చిన సతీసావిత్రిని అభినందించారు.

పుత్తూరు వార్తలు

హంస వాహనంపై స్కందుడి విహారం

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 53 వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లు బుధవారం రాత్రి హంస వాహనంపై ఊరేగారు. బుధవారం ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం దేవేరుల సహా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హంస వాహనంపై పట్టణంలో విహరించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి



విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్

పుత్తూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కళాశాలలో అధ్యాపకులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు కలిసి కట్టుగా పిల్లల మీద శ్రద్ధ పెడితే వారు ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి, ఫీజు రీయంబర్స్ మెంట్ లు వస్తాయనే విషయాలను తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలన్నారు. అధ్యాపకులు వీరయ్య, సుజన, నరసింహులులు పాల్గొన్నారు.

గృహ విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణలో 50 శాతం రాయితీ

పుత్తూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించేందుకు చెల్లించాల్సిన చార్జీలలో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందని పుత్తూరు విద్యుత్ డీఈ దేవ ఆశీర్వాదం తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు కిలోవాట్లు, నగరాలలో మూడు కిలోవాట్లు లోడ్‌తో కనెక్షన్లు తీసుకోవాలన్నారు. ఈ మేరకు కిలోవాట్‌కు రూ.2వేలు డెవలప్‌మెంట్ చార్జీతో పాటు రెండు వందలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు.. అయితే ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఉంటుందన్నారు. అన్నారు. విద్యుత్ సిబ్బంది ద్వారా కానీ ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు.

షూటింగ్ బాల్ రాష్ట్ర జట్టులో షర్వాణికి స్థానం



పుత్తూరు అర్బన్, మార్చి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్టులో స్థానం సాధించిన షర్వాణికి అభినందనలు వెల్లువెత్తాయి. పుత్తూరు ఎంపీయూపీ ప్రధాన పాఠశాలలో షర్వాణి 8వ తరగతి చదువుతోంది. తెలంగాణ రాష్ట్రం నల్గొండలో జరిగిన 4వ సబ్ జూనియర్ సౌత్ జోన్ షూటింగ్ బాల్ నేషనల్ చాంపియన్ షిప్ పోటీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. మూడోస్థానంలో నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు షర్వాణికి అభినందనలు తెలియజేశారు.

తిరుపతిలో 8 నుంచి సీఐటీయూ వర్క్‌షాపు

తిరుపతి(ఆటోనగర్) మార్చి5(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేది నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో రాయలసీమ స్థాయి సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులతో వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. 8న సీఐటీయూ వ్యవస్థాపకులు బాలానందన్ శత జయంతి సభ అనంతరం వర్క్‌షాపు ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర నాయకులు ఏ.వి.నాగేశ్వరరావు, సీహెచ్ నరసింగరావు, జీ.ఏబు, పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వరదయ్యపాళెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఇందులో మహిళా సాధికారత, హక్కులు, సమానత్వం వంటి అంశాలపై చర్చించారు. మహిళా సభ్యురాలు గిరిజను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్ కోఆర్డినేటర్ లోకేష్, మార్కండేయరెడ్డి, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో ఆరె జలపాతాలు



ఆరే జలపాతానికి వెళ్లే మార్గం - వాహన పార్కింగ్ - ప్రధాన జలపాతం

కేవీబీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె గ్రామం సమీపంలో ఉన్న ఆరె జలపాతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. సెలవు దినాల్లో ఎంతో మంది పర్యాటకులు ఇక్కడకి వస్తున్నారు. అయితే కనీస వసతులు ఇక్కడ కానరావు. ఆరె గ్రామం నుంచి జలపాతాలకు చేరుకోవాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు వెళ్లాలి. అక్కడ వాహనాలను పార్కు చేసుకుని అక్కడ నుంచి కొండల మధ్య పచ్చని చందనం చెట్ల కింద కాలిబాటన సుమారు రెండు కిలోమీటర్లు వెళితే మొదటి జలపాతం, కాస్త ముందుకు వెళితే కొండలనుంచి ప్రవహిస్తున్న రెండో జలపాతం అలాగే మూడు, నాలుగు, ఐదు జలపాతాలు కనువిందు చేస్తాయి. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులు కనీసం వసతులు ఏమీ లేవు. టిఫిన్, భోజన సౌకర్యం, కనీసం టీ కూడా దొరకదు. అయితే పర్యాటకుల నుంచి ఒకరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. దీనికి తోడు ద్విచక్ర వాహనాలకు రూ.100, కార్లుకు రూ.300 చొప్పున అటవీ శాఖ వసూలూ చేస్తోంది. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేశారే గాని అది కేవలం తాగునీటికి మాత్రమే సరిపోతుంది. వర్షాకాలంలో సోలార్ కూడా పని చేయడం లేదు. అప్పుడు తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికీ ఆరె నుంచి జలపాతాలకు మట్టిరోడ్డే గతి. అయినా వందల సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్.. జలపాతాల సమీపం వరకు తారు రోడ్డు, బస్సు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

భూ సేకరణ కోసం రికార్డుల పరిశీలన

పరిహారమెంతో తేల్చండని రైతుల నిలదీత



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సత్యవేడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లడం, పెద్దఈటిపాకం, ఇరుగుళం గ్రామాల్లో ఏపీఐఐసీ చేపడుతున్న భూసేకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో సర్వేలు పూర్తి చేసిన అధికారులు బుధవారం నుంచి అవార్డ్ ఎంక్వైరీ (రికార్డుల పరిశీలన)ను ప్రారంభించారు. ఈ మేరకు కొల్లడం, పెద్దఈటిపాకంలలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల బృందం భూ సేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని రైతుల రికార్డులను పరిశీలించారు. భూ సేకరణ జరుగుతున్న గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలతో పాటు, రైతు అనుభవంలో ఉన్న భూ విస్తీర్ణం, అనువంశికం, వన్ బీ, అడంగల్ తదితర రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే ఈ సందర్భంగా పలువురు రైతులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తమ భూమిని లాక్కుంటున్న ప్రభుత్వం పరిహారం కింద ఎంత చెల్లిస్తున్నారో చెప్పకుండా మెడమీద కత్తిపెట్టి లాగేసుకుంటోందని వాపోయారు. ముందు పరిహారం తేల్చి తర్వాత రికార్డుల పరిశీలన జరపాలని కొందరు రైతులు పట్టుబట్టారు. అయితే అధికారులు మాత్రం ఇది కేవలం రికార్డుల పరిశీలన మాత్రమేనని, పరిహారం చెల్లింపు వివరాలు తమకు తెలియదన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి సంబంధిత వివరాలు అందగానే తెలియజేస్తామని సమాధానం ఇవ్వడంతో రైతులు సంతృప్తి చెందలేదు. దీంతో గందరగోళం చోటు చేసుకుంది. కాగా తొలి విడత పరిశీలనలో భాగంగా కొల్లడంలో ముగ్గురు రైతుల నుంచి 3.30 ఎకరాలు, పెద్దఈటిపాకంలో 54 మంది రైతుల నుంచి 17.44 ఎకరాలకు సంబంధించిన పట్టాదార్ పాసుపుస్తకాలు, అడంగల్, వన్‌బీలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయుడుపేట, ఓజిలి తహసీల్దార్లు రాజేంద్ర నాయుడు, పద్మావతి, సత్యవేడు ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్, రెవెన్యూ బృందం పాల్గొన్నారు. భూసేకరణ రికార్డులు పరిశీలన జరుగుతున్న గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుక



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

శ్రీసిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో కార్మికుల భద్రత ఆవశ్యకతను గుర్తిస్తూ శ్రీసిటీలో వారం రోజులుగా జరుగుతున్న 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. స్థానిక బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ భద్రతా జెండాను ఎగురవేసి ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలకు భద్రతా, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే జాతీయ భద్రతా వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు, ఉద్యోగులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసిటీ సెక్యూరిటీ, విజిలెన్స్ సీనియర్ మేనేజర్ వై.రమేష్, మహ్మద్ అలీ, శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అబ్బురం... చిన్నారుల నృత్యం

ధూర్జటి కళాప్రాంగణంలో ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న షణ్ముఖ జనని, ధనుష్క తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో బుధవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం చతుర్వేద పారాయణ సభతో వేదికను ప్రారంభించారు. ఇందులోభాగంగా తిరుపతికి చెందిన శైలజ, జతీష్ నృత్యాలయ బృందం సభ్యులు వివిధ భక్తి గీతాలకు శాస్త్రీ య నృత్య రూపకం ప్రదర్శించారు. కళాకారుల అభినయం అందరిని ఆకట్టుకుంది. అలాగే తిరుపతికి చెందిన షణ్ముఖ జనని, ధనుష్క అక్కాచెల్లెళ్లు నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 7.30గంటలకు ఇక పుదూరు పల్లవి శరల్ భరతనాట్యం, 8గంటలకు కాకినాడకు చెందిన బాల త్రిపురసుందరి కూచిపూడి నృత్య ప్రదర్శన, 9గంటలకు బెంగళూరుకు చెందిన చారు పార్థిబన్ భరతనాట్యం ఆహూతులను అలరించాయి. చివరగా తిరుపతికి చెందిన శారద నాటక కళామండలి శ్యామ్‌సాయి ప్రదర్శించిన బాలనాగమ్మ ప్రదర్శన జరిగింది. బుధవారం నాటితో ధూర్జటి కళాప్రాంగణంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



శేఖర్(ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొనడంతో కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి పట్టణం పానగల్‌కి చెందిన శేఖర్(30) ధాన్యం కాటా వేసే కూలీ. మంగళవారం రాత్రి పనులు ముగించుకుని జాతీయ రహదారిపై నడిచి ఇంటికి బయలుదేరాడు. మంగళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి అమరావతికి ప్రయాణికులతో వెళ్తుండగా ఊరందూరు వద్ద ఢీకొంది. ఈ ఘటనలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బుధవారం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్కుర్తి వద్ద యువకుడి దుర్మరణం...



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం ఉప్పరపల్లికి చెందిన వంశీ ఏర్పేడు మండలంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తుంటాడు. బుధవారం సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అక్కుర్తి వద్ద మలుపులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ రవినాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో కిర్లోస్కర్ టయోటా డైరెక్టర్

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకళహస్తీశ్వరస్వామిని కిర్లోస్కర్ టయోటా కంపెనీ డైరెక్టర్(కర్ణాటక) టీఆర్ నాగరాజన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ ప్రారంభం



ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నంది సర్కిల్ వద్ద బుధవారం నందీశ్వర ఆటోస్టాండ్‌ను సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ రహదారి ఏర్పడిన తరువాత పట్టణంలోకి యాత్రికులు చేరుకోవాలంటే ఇబ్బంది పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆటోస్టాండ్ వల్ల వారి ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ, సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య, నందీశ్వర ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై వేంకటేశ్వరుడి వైభవం



శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలం తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామిఅమ్మవార్లు అశ్వవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. ముందుగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది. అనంతరం గ్రామ వీధుల్లో తిరుచ్చిపై ఊరేగారు. సాయంత్రం ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. రాత్రి సర్వాలంకారశోభితుడైన స్వామివారు అశ్వ వాహనంపై ఆసీనులై గ్రామంలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యల మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.